ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY




నేటి 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం పరిపాలన పరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినందున ప్రజలు ఫిర్యాదులిచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని, వచ్చే సోమవారం ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ అన్నారు.

యోధుడి జ్ఞాపకాలు పదిలం



సర్వాయిపేటలో పాపన్న కట్టించిన బురుజు



పాపన్న కోట



సర్వాయిపేట గుట్టపై పాపన్న విగ్రహం

- పర్యాటక కేంద్రంగా పాపన్న గుట్టలు
- మొదటి విడతలో రూ. 4.7 కోట్ల నిధులు విడుదల

సైదాపూర్, ఆగస్టు 18: అనగారిన వర్గాలకోసం పోరాడిన యోదుడు సర్దార్ సర్వాయి పాపన్న నివసించిన ప్రాంతం, ఆయన జ్ఞాపకాలను పదిలం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింయి. ఈ మేరకు పాపన్న జయంతిని పురుస్కరించుకుని సర్వాయిపేట ప్రాంతాన్ని, పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మొదటి విడుతగా రాష్ట్ర పర్యాటక శాఖ రూ. 4.7 కోట్ల నిధులను ఆదివారం విడుదల చేసింది. సర్వాయి పాపన్న ఆనవాళ్లను, చరిత్ర కలిగిన గుట్టలను కాపాడేందుకు సర్వాయిపేట గ్రామస్థులు, గౌడ సంఘాలు చేసిన పోరాటం ఫలించింది.

పాపన్న గుట్టలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు

గతంలో పాపన్న గుట్టలపై మైనింగ్ మాఫియా కన్ను వేసింది. పాపన్న గుట్టపై క్వారీ నిర్వహించేందుకు అనుమతులు తీసుకుంది. క్వారీ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించింది. గ్రామస్థులు ఆ ప్రయత్నాలను అడ్డుకుని, చరిత్ర ఉన్న గుట్టలను, పాపన్న జ్ఞాపకాలను ధ్వంసం చేయవద్దని వేడుకున్నారు. గౌడ సంఘాల నాయకులు పాపన్న గుట్ట వద్దకు చేరుకొని గ్రామస్థులతో కలిసి ఆందోళనలు నిర్వహించారు. కాంట్రాక్టర్ 2019లో క్వారీ ఏర్పాటుకు మళ్లీ అనుమతులతో వచ్చారు. కానీ గ్రామస్థులు, గౌడ సంఘాల నాయకలు మళ్లీ అడ్డుకొని ఆందోళనలు చేశారు.

'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 23 జూన్ 2019న యోధుడి జ్ఞాపకానికి మైనింగ్ ముప్పు అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. 24 జూన్ 2019న పర్యాటక, పురావాస్తు శాఖ వారు ఆ జీవో కాపీతో వచ్చి పాపన్న జ్ఞాపకాలున్న ప్రాంతాన్ని, పాపన్న గుట్టలను పరిశీలించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అప్పటి నుంచి 'ఆంధ్రజ్యోతి' ఆ ప్రాంతం పర్యాటక కేంద్రానికి అనుగుణంగా ఉందని పలు కథనాలు ప్రచురించిది.

మాట నిలబెట్టుకున్న సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సర్వాయిపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ ఎన్నికల సమయంలో, గెలిచి మంత్రి అయిన తరువాత సర్వాయిపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాపన్న జయంతి రోజు పర్యాటక కేంద్రం ఏర్పాటుకు మొదటి విడత నిధులు విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారని గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వానికి... 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు

మండల జంపయ్య, జీవ వైవిధ్య కమిటీ సభ్యుడు, సర్వాయిపేట

పాపన్న గుట్టలను, ఆయన చరిత్రను, ఈ ప్రాంత వనరులను కాపాడేందుకు 2011 నుంచి చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కింది. తమ ఆవేదనను, తమ సమస్యలను గుర్తించి యోధుడి జ్ఞాపకానికి మైనింగ్ ముప్పు అనే కథనం ప్రచురించి, 'ఆంధ్రజ్యోతి' ప్రభుత్వాన్ని కదిలించింది. ఇచ్చిన మాట ప్రకారం సర్వాయిపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 4.7 కోట్ల నిధులు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు.





23 జూన్ 2019న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



సర్వాయిపేటలోని పాపన్న గుట్టలు

45 శాతం మందికే రైతురుణమాఫీ

- మిగిలిన రైతులకు సర్కారు శఠగోపం పెట్టొద్దు
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేవంత్ రెడ్డి సర్కార్ 45 శాతం రైతులకే రుణమాఫీ చేసిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ప్రభుత్వం మొదట 41వేల కోట్లు రుణమాఫీకి అవసరమని చెప్పి, కేబినెట్ భేటీలో 37 వేల కోట్లు అన్నారని, ఇప్పుడు 17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తి పోయక పోవడంతో ఇప్పుడు ఉత్తర తెలంగాణ ఎడారిగా మారే పరిస్థితి వచ్చిందన్నారు.



ఇప్పటి వరకు రైతులు 60 శాతం మాత్రమే పంటలు సాగుచేశారని అన్నారు. కొన్ని జిల్లాలో 40 శాతం కూడా పంటలు సాగుకాలేదని తెలిపారు. పదేళ్ళ తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు ఎర్రటి ఎండల్లో కూడా చెరువులు మత్తళ్ల దూకాయని, కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనలో వర్షాకాలంలో కూడా చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయిందని వినోద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం పంపులను ఆన్ చేసి ప్రాజెక్టులన్నింటిని నీటితో నింపాలని డిమాండ్ చేశారు.

పండితులకు పదోన్నతులు కల్పించడం అభినందనీయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: దశాబ్దకాలంగా నిరీక్షిస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పదోన్నతుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేయడం అభినందనీయమని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండితుల పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి ఆర్‌యూపీపీటీ పోరాటం చేసిందన్నారు. స్వరాష్ట్రంలోనూ ముఖ్యమంత్రులు పదోన్నతుల సమస్యను పరిష్కరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతులు కల్పించి తమ దశాబ్దల కల సాకారం చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు ఎన్ చైతన్య, ప్రధాన కార్యదర్శి ఎన్ కరుణాకర్, రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, నాయకులు ఉమర్ అలీ, ఫాజిల్, స్వామి, జహంగీర్, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 18: దేశంలో మహి ళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు వసతి గృహాల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, అనేక చట్టాలు తీసుకు వస్తున్నా దాడులు ఆగడం లేదన్నారు. నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన పది సంవత్సరాల్లో మహిళలపై దాడులు అనేకం పెరిగిపోయాయన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇసాక్, జిల్లా సహాయ కార్యదర్శి నాగుల శ్రీజ, జిల్లా కమిటీ నాయకులు గట్టు ఆకాశ్, రిజ్వానా పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ పమే లా సత్పతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని, సాధారణ కుటుంబంలో జన్మించి అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహాయోధుడని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, బీసీ సంఘాల నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, అమరగోని నర్సయ్యగౌడ్, వీరగోని పెంటయ్యగౌడ్, పొన్నం సత్యం, జక్కుల మల్లేశంగౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, మాచెర్ల అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.



ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని 32వ డివిజన్ కట్టరాంపూర్, వినాయకనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వివిధ పథకాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా వేగంగా చేపట్టాలని ఆదేశించారు. కట్టరాంపూర్ ప్రాంతం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. కట్ట రాంపూర్ ప్రధాన రోడ్డు స్మార్ట్‌సిటీలో అభివృద్ధి చేసే క్రమంలో కొన్ని పనులు ఆగిపోయాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని మేయర్ ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మర్రి భావన సతీష్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 18: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ తిరుమల్ అన్నారు. ఆదివారం మండలంలోని కాట్రపల్లిలో సైబర్ మోసాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్లకు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమంటారని, అలాంటివి చెప్పకూడదన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. యువత గంజాయిలకు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు.

భాషకందని భావం..



అరుణ కిరణాలు..

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 18: ఒక ఛాయా చిత్రం కోటిభావాలకు కదలిక.. ఒక్క ఫొటో ఎన్నో భావాలను ఆవిష్కరిస్తుంది..భాషకందని భావాలు కలిగించేది ఫొటోగ్రఫీ.. వివిధ రంగాల్లో నేడు ఫొటోగ్రఫీ వేగంగా విస్తరిస్తోంది.. గతంలో బ్లాక్ అండ్ వైట్‌లో ఉండే ఛాయ చిత్రాలు నేడు ఆధునిక టెక్నాలజీతో అనేక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. కమర్షియల్‌గానే కాకుండా పిక్టోరియల్ ఫొటోగ్రఫీ వేగంగా విస్తరించింది. ప్రతియేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

• ఫొటోగ్రఫీ చరిత్ర...

1886లో ఫొటో తీసే పరికరాన్ని ఫ్రెంచ్ శాస్త్రవేత్త జోసఫ్ నీల్‌ఫోర్ తయారు చేసి తొలిఫొటోను తీశారు. 1839 ఆగస్టు 18న ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌జేఎం డాగురే సిల్వర్ అయోడైడ్ విధానం ద్వారా దృశ్యాన్ని శాశ్వతంగా ఉంచవచ్చ ని నిరూపించారు. 1839 ఆగస్టు 19న ఈ విషయాన్ని ప్రపంచానికి చాటారు. 1855లో ఈస్టిండియా కంపెనీ ముంబైలో ఎల్‌పీ స్టోన్ ఇనిస్టిట్యూట్ పేరుతో ఫొటోగ్రఫీ శిక్షణా సంస్థను తొలిసారిగా ఏర్పాటు చేసింది. 1960 నాటికి స్టూడియో ఫొటోగ్రఫీ విస్తృతమైంది. 1980లో కంప్యూటర్ రైజ్డ్ ప్రింటింగ్ మిషన్లతో కలర్ ఫొటోగ్రఫీ ప్రభంజనం మొదలైంది. 1957లో రాజా త్రయం బక్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సొసైటీ 1972లో అకాడమీగా మారింది. 1961లో కరీంనగర్‌లో మొదటిసారి ఫొటో స్టూడియో ఏర్పాటు చేశారు.



ఆత్మవిశ్వాసమే అండగా..



అవ్వకు తోడుగా..



మబ్బే.. మసకేసిందిలే..

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- నీళ్లు వేడి చేసేందుకు హీటర్ పెడుతుండగా ప్రమాదం

మేడిపల్లి, ఆగస్టు 18: కట్లకుంట గ్రామంలో స్నానానికి నీళ్లు వేడి చేసేందుకు హీటర్ పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గడ్డం మాలకొండయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. నెల్లూరు జిల్లాకు చెందిన మాలకొండయ్య ఐదు నెలలుగా గ్రామంలో తాపీ పని చేస్తున్నాడు. ఆదివారం స్నానం చేసేందుకు నీళ్లు పెడుతూ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం ఆదివారం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్ర స్తుతం 49.117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, ఆగస్టు 18: మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కి చెందిన షేక్ ఫారూఖ్ కొడిగుడ్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కొడిగుడ్లను తీసుకొని ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో మండలంలోని ఇందిరానరగ్ గ్రామం సమీపంలో రాజీవ్ రహదారిపై హైదారాబా ద్ నుంచి కరీంనగర్‌కు అతివేగంగా వచ్చిన ఓ లారీ ఫారూఖ్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కింద పడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం చేసిన లారీ డ్రైవర్ వాహనం ఆప కుండా పారిపోయేందుకు యత్నించాడు. స్థానిక యువకులు లారీని వెంబడించి పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఫారూఖ్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని చేరుకొని ఫారూఖ్‌ను 108లో కరీంనగర్ తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల పట్టణంలోని నూతన బస్టాండ్ లో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణ ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి గుర్తించారు. జగిత్యాల పట్టణ కొత్తబస్టాండ్ లో ఓ మహిళ అపస్మారక స్థితిలో పడిఉందని పోలీసులకు స మాచారం అందింది. ఈమేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మహిళను పరీ శీలించి చూడగా మహిళ మృతిచెంది ఉన్నది. మహిళ గులాబీ కలర్ స్వెటర్ ధరించి బ్రౌన్ కలర్‌చీర ధరించి ఉందని పట్టణ పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మా ర్చురీగదిలో భద్రపరిచినట్లు ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మహిళ ఆచూకి ఎవరికైన తెలిస్తే జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి వీధి వద్ద ఆదివారం రాజీవ్‌బైపాస్‌మీదుగా ప్రయాణిస్తున్నకారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ధర్మపురివైపు నుంచి జగిత్యాల వైపు కారులో వెళ్తుండగా ఒక్కసారిగా బ్రేక్‌పై పడడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల సందడి


స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 18: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. అంతకు ముందు అనుబంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదు

- కేసీఆర్, కేటీఆర్ అంటేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: అవినీతి పార్టీగా ప్రజల్లో ముద్రపడిన బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ భారతీయ జనతా పార్టీకి లేదని, ప్రస్తుతం తెలంగాణలో కేసీఆర్, కేటీఆర్ పేరు ఎత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా చండీయాగంలో బండి సంజయ్‌కుమార్ ఆదివారం పాల్గొనగా ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘం నాయకులు, పద్మ పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అవరణంలో జరుగుతున్న యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నగల షోరూంను బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 24 లక్షల మందికే మాఫీ చేయడం ఏమిటని అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకారం ఎన్నికల్లో రూ 40 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి బడ్జెట్‌లో రూ 26 వేల కోట్లు కేటాయించి చివరకు రూ 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినట్లు చెబుతూ మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతులకు బ్యాంకుల నుంచి క్లియరెన్స్ సర్టిఫికేట్‌లను ఇప్పించాలని అన్నారు. రుణాలు తీసుకున్న రైతులకు క్లియరెన్స్ సర్టిఫికేట్‌లు రాకుంటే భవిష్యత్తులో ఎలాంటి రుణాలు పొందలేదనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి లక్ష రూపాయలు, తులం బంగారంతో సహా ఆరు గ్యారంటీలు ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 30 వేల ఉద్యోగాలని చెప్పి కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం


సిరిసిల్లలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని ప్రజలకు అన్నీ చేశామని అనుకుంటుందని అన్నారు. రైతు భరోసా, బోనస్, రుణమాఫీ చేస్తామని చేయలేదనే ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. రైతులు అమాయకులు కాదని, వారు దుఖంలో ఉన్నారని వారికి భరోసా కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మోసపూరిత వాగ్దానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కో కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, గరిపెల్లి ప్రభాకర్, అన్నల్‌దాస్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం


- టీఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్


మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన జగదీశ్వర్‌ను పట్టణంలోని సంఘ కార్యాలయంలో పలువురు అసోసియేషన్ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపకల్పనకు 15 మందితో రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక సర్కారు అని చెప్పి చివరకు సంఘాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కనీసం ఒకటవ తేదీన వేతనాలను సైతం అందివ్వలేదని ఆరోపించారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీననే వేతనాలు, పెన్షన్లు అందిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదు రహిత వైద్య సేవలు, 317 జీవో, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్తుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కందుకూరి రవి బాబు, వొద్నాల రాజశేఖర్, బైరం హరి కిరణ్, వెల్ముల ప్రకాశ్‌రావు, రవిచంద్ర, రవీందర్, మమత, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మహమూద్, భువనేశ్వర్, కుమార స్వామి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 18: కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి వస్తున్న ఇన్‌ఫ్లోలు ఆదివారం సాయంత్రానికి తగ్గాయి. రెండు, మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మోయతుమ్మెద వాగు నుంచి ఎల్‌ఎండీలోకి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. కాగా వర్షాలు లేకపోవడంతో పై నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గయి. శనివారం ఉదయం 1,190క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా సాయంత్రానికి 1,551క్యూసెక్కులకు పెరిగింది. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో 2,197క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 6గంటల ప్రాంతంలో కేవలం 707 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రం 5.723టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.


ఎల్‌ఎండీలో ఉన్న ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు

గంజాయి కిట్ల సహాయంతో ఆరుగురు నిందితుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 18: గంజాయి కిట్ల సహాయంతో జిల్లా వ్యాప్తంగా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం తెలిపారు. రెండు రోజుల వ్యవధిలోనే వీరి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయికి అలవాటు పడి తాగేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గంజాయి రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో టెస్టులు చేస్తూ గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో ఇద్దరు నిందితులైన ఒల్లెపు వంశీ, భీంరాజ్‌లను అదుపులోకి తీసుకొని 200 గ్రా ముల గంజాయిని, కోనరావుపేటలో ఇద్దరు నిందితులైన అరుణ్, అజ్మీర్‌వికాస్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని, తంగళ్లపల్లిలో ఇద్దరు నిందితులైన సాయి, సాగర్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

25న సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా రోడ్ సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఆదివారం అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, సైక్లింగ్‌తో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వెలిచాల బైపాస్ రోడ్డులో 25న అండర్-14, 16, 18, 23, ఆపై వయస్సు విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరుకావాలన్నారు. సమావే శంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు రమేశ్, ఎస్.మనోహరాచారి, ఎస్.అన్వేష్, ఎస్ రాజయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు స్పందన


బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు18: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరై ప్రతిభ చాటారు. వీరిలో విశేష ప్రతిభ చాటిన 18 మంది బాలురు, 18 బాలికలను ఈనెల 24వరకు అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. జిల్లా పోటీల నిర్వహణను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి పర్యవేక్షించారు. సీనియర్ క్రీడాకారులు, పీడీలు శ్రీధర్‌రావు, సునీల్‌కుమార్, దూడ సత్యానందం, అరుణ్‌తేజ, జీవన్‌కుమార్, వెంకటేష్, జాయ్ అనిల్, పర్మిత్‌కౌర్, అభి, జోయల్, హెన్రీ, శివకుమార్ పాల్గొన్నారు.

అల్లుడిపై మామ దాడి

- బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి

జూలపల్లి, ఆగస్టు 18: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఆదివారం అల్లుడిపై మామ దాడిచేశాడు. తలపై రాడ్‌తో కొట్టడంతో అల్లుడైన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య(40) మృతిచెందాడు. జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన జాడి కనుకయ్య తన అల్లుడైన అదే గ్రామానికి చెందిన అశోక్‌ను ఆదివారం మధ్యాహ్నం విందు ఇస్తానంటూ ఇంటికి పిలిపించుకున్నాడు. ఇంట్లో ఉన్న రాడ్‌తోపాటు బండరాళ్లతో అశోక్ తలపై కనుకయ్య బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పదేళ్లుగా తన భార్యతో అశోక్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కనుకయ్య ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కూతురు జేజేల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు ..ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, ఆగస్టు 18: జగిత్యాల-కరీంనగర్ మార్గంలోని నూకపల్లి వరదకాలువ బ్రిడ్జి వద్ద మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలు అయ్యాడు. కారు ఢీకొని వేగంగా ముందుకు దూసుకెళ్లగా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన జనగాం బాలగౌడ్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం గూడెంకు వస్తుండగా వరదకాలువ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో కింద పడిన అతని ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు 108లో తరలించారు. ఢీకొని వెళ్లిన కారు కోసం ఎస్సై నరేష్‌కుమార్, పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. రెండు గంటల వ్యవధిలోనే వేములవాడ సమీపంలో కారును పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

వేములవాడ రూరల్, అగస్టు 18: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లి గ్రామానికి చెందిన గీస శిరీష (20) డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో కుట్టుమిషన్ పనులు చేసుకుంటుంది. ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శిరీష ఆదివారం రాత్రి మృతి చెందింది. శిరీష తండ్రి గీస లచ్చయ్య జీవనోపాధికై గల్ఫ్‌కు వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వేధింపుల వల్లే తన చెల్లి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నయ్య గీస శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి

- గుర్తించిన పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 18: రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తిని ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తాండకు చెందిన బానోతు నరేష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో కుటుంబ సమస్యల కారణంగా ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పోయాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు కోనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నరేష్ గురించి ఎలాంటి ఆచూకీ తెలవకపోవడంతో చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ శేఖర్ రెడ్డి సిబ్బందితో టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడని తెలుసుకొని అక్కడికి సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపించి సమాచార సేకరించారు. బానోతు నరేష్‌తో సీఐ మాట్లాడగా తన కుటుంబ కలహాలు వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయానని తెలిపాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శేఖర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

కొండగొర్రె మాంసం స్వాధీనం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొండ గొర్రెను చంపిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి ఆదివారం తెలిపారు. అటవీ ప్రాంతంలో బండలు కొడుతున్న షరీఫ్, యాకూబ్ అనే వ్యక్తులు అటుగా వెళుతున్న కొండగొర్రెను రాళ్లతో కొట్టి చంపేశారు. చనిపోయిన కొండ గొర్రెను వండుకునే సమయంలో డీఆర్‌వో అంజలి పక్కా సమాచారంతో సిబ్బందితో వెళ్లి గొర్రె తలకాయ, కాళ్లు, మాంసాన్ని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కొండ గొర్రెను చంపిన వారిని పట్టుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌ను ఎఫ్ఆర్‌వో అభినందించారు. షరీఫ్, యాకూబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో కల్పనదేవి తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8791 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.560 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

- మిడ్ మానేరు నుంచి..

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కులు, మూల వాగు నుంచి 2930 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.65 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.76 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

- 'అన్నపూర్ణ'లోకి..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.14 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని మోసగించిన ఒకరిపై కేసు

మేడిపల్లి, ఆగస్టు 18: తన మిత్రుడికి ఎమ్మెల్యే తెలుసు అని నీ కొడుకుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి మహిళ దగ్గర నుంచి రూ 35 వేలు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసమోదు చేశారు. మేడిపల్లి మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన రేగుల రాజేందర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళ కొడుకుకు వేములవాడ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ 35 తీసుకున్నాడు. తన మిత్రుడైన చందూర్తి మండలం కిష్టపేట గ్రామానికి చెందిన చిగురుల మల్లేశం ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు దగ్గర అని చెప్పి ఇద్దరు కలిసి మహిళ దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నారు. కాగా ఆ తరువాత గురుకుల పాఠశాలలో ఫ్రీ సీటు వచ్చిందని తెలుసుకుని తనను మోసం చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

మోరపల్లి బస్సు ఘటన పై కేటీఆర్ ట్వీట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్- మోరపల్లి గ్రామ శివారుల మధ్యలో జరిగిన బస్సు ప్రమాదం పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 170 మంది ఎక్కారని, దాంతో మోరపల్లి వద్ద నిర్మల్ డిపో బస్సులో 170 మంది ప్రయాణిస్తున్న బస్సు వెనుక రెండు టైర్లు ఊడిపోయాయని, ఈ ప్రమాదంలో ఎవరు గాయపడకపోవడం అదృష్టమే అన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఎందుకు అమాయక పౌరుల జీవితాలతో ఆడుకుంటున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని ఎప్పుడు ఆలోచిస్తారని, ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే విషయంలో ఏదైనా భద్రత ప్రోటోకాల్ అనుసరిస్తున్నారా, అధికపనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు మీరు ఎలా పరిహారం చెల్లిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



సోషల్‌మీడియా వేదికగా కేటీఆర్ చేసిన పోస్ట్

బిల్డింగ్ పైనుంచి పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి

వేములవాడ టౌన్, ఆగస్టు 18: బిల్డింగ్‌పై నుంచి పడి తలకు తీవ్రగాయాలైన బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన నడిగొట్ల రాజేష్, లావణ్య దంపతుల కుమారుడు ప్రజ్వల్ (4) అనే బాలుడు నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌లో తామ నివాసం ఉంటున్న బిల్డింగ్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో కింద వున్న ఇనుప సీకులపై పడటంతో బాలుడి తలలో గుచ్చుకుని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.


ప్రజ్వల్(ఫైల్)

● ఆరెపల్లిలో విషాదం..

వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ప్రజ్వాల్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అములుకున్నాయి. బాలుడి చికిత్స కోసం రూ 20 లక్షల ఖర్చు అవుతాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాతలు స్పందించి విరాళాలు అందించారు. బాలుడి చికిత్స కోసం ఇప్పటి వరకు రూ 8 లక్షల వరకు ఖర్చు అయినట్లు బాధితులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మరణిస్తూ ఐదుగురికి ప్రాణదానం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్‌డెడ్ - అవయవదానానికి కుటుంబసభ్యుల అంగీకారం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవదాన ప్రాధాన్యాన్ని హైదరాబాద్ జీవన్ దాన్ సంస్థ, అపోలో వైద్యులు అవగాహన కల్పించారు. దీంతో పుట్టెడు దుఖంలో అవయవ దానం చేసేందుకు ఆ యువకుడి తల్లి అంగీకరించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నర్సింలు, దేవలక్ష్మి దంపతులకు నరేష్, నవిత ఇద్దరు సంతానం. రెండేళ్ల కిందట నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారం కొడుకు నరేష్ మీద పడటంతో తల్లిని, చెల్లిని వదిలి ఏడాది కిందటే గల్ఫ్ బాట పట్టాడు. చెల్లి పెళ్లి చేసి, తాను పెళ్లి చేసుకుంటానని ఇటీవలనే ఇంటికి వచ్చాడు. లింగన్నపేటలో తన మేనమామ మృతి చెందగా, లింగన్నపేటకు వెళ్లి వస్తూ ఈ నెల 13న రైస్‌మిల్ వద్ద నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం నరేష్ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. జీవన్ దాన్ అవయవ దానం గురించి అవగాహన కల్పించగా నరేష్ తల్లి అవయవ దానానికి అంగీకరించింది. నరేష్ కళ్లు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను దానం చేసి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. దీంతో తన కొడుకు భౌతికంగా లేపోయినా ఐదుగురికి పునర్జన్మ కల్పించిన ఆ మాతృమూర్తిని పలువురు అభినందించారు.


నరేష్ శవపేటిక వద్ద రోదిస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో నరేష్(ఫైల్)

తీవ్ర గాయాలతో బ్రెయిన్‌డెడ్

● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు

మల్యాల: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు మృతుడి అవయవాలు దానం చేశారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన ముస్కెల నరేందర్ (51)అనే రైతు తన వ్యవసాయ పొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో నరేంద ర్ తల, ముఖం తదితర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్, హైదరాబాద్ తీసుకెళ్లారు ముఖం, దవడలకు తీవ్ర గాయాలు కాగ శస్త్ర చికిత్సలు చేశారు. తలకు అయిన తీవ్ర గాయాలతో రెండు రోజుల క్రితం బ్రెయి న్‌డెడ్ అయింది. దీంతో హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో కుటుంబసభ్యులకు అవయవదానం పై వివరించడం తో శనివారం రాత్రి కుటుంబసభ్యులు నరేందర్ కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులను దానం చేశారు. ఆదివారం మృతదేహం మద్దుట్లకు రాగ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని కుటుంబసభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు


నరేందర్(ఫైల్)

'కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఆరోపణలు మానుకోవాలి '

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా రెండు సార్లు గెలిచి కేంద్ర మంత్రి పదవి చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌పై అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేశ్ కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావును ఒక ప్రకటనలో హెచ్చరించారు. కరీంనగర్ పేరు మార్చాలన్నప్పుడే నీ తెలివితేటలు ఏమిటో తెలిసిందని, డీసీసీ అధ్యక్ష పదవి కోసం కేంద్రమంత్రిపై ఆరోపణలు చేస్తున్నాడన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో తోపుడు బండి వితరణ

సుభాష్‌నగర్, ఆగస్టు 18: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం ఎదుట రాగి జావ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్రీకాంత్ అనే నిరుపేదకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో తోపుడు బండి వితరణ చేశారు. ప్రతి రోజు ఉదయం రాగిజావ అమ్ముకోవడానికి చాలా ఇబ్బందులు పడుతుండేవాడని, తోపుడు బండి కొనుక్కునే స్తోమత లేకపోవడంతో క్లబ్ బాధ్యులు స్పందించి ఆయనకు తోపుడు బండిని అందచేశారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ అకెనపల్లి నాగరాజు, అధ్యక్షుడు బొడ్ల శ్రీవణ్, జెడ్‌జీ వేణుగోపాల్, బొడ్ల శ్రీవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జిల్లా చంద్రశేఖర్, కోశాధికారి కొల్లూరి హరిప్రసాద్, పైడ రవి, నగునూరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత

సుభాష్‌నగర్, ఆగస్టు 18: కరీంనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డెడ్‌బాడీ ఫ్రీజర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. క్లబ్ సభ్యుడు నలుమాచు శ్రీనివాస్ తన తల్లిదండ్రులు మణెమ్మ, లక్ష్మయ్యల జ్ఞాపకార్థం ఈ ఫ్రీజర్‌ను అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మల్టిపుల్ చైర్మన్, హెచ్ రాజిరెడ్డి, జిల్లా గవ ర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, ఉప గవర్నర్లు కోదండరామ్, భద్రేశం, క్లబ్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట రమణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

●గణేశ్‌నగర్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తెలంగాణ చౌక్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాగ్రత్త వహించాలని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడిగా పర్యటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కఠినమైన శిక్షలు రావాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక మెడికల్ కళాశాలలోనే ఇటువంటి సంఘటనలు జరిగితే సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. బేటీ బచావో, బేటి పడావో అనేది ప్రచార నినాదం వరకే మిగిలిపోతుందని కేంద్ర ప్రభుత్వం మహిళల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. దేశంలో మహిళల పట్ల హత్యలు, అత్యాచారాలు, వేధింపులు ఎక్కువ అవుతున్నాయని అరికట్టవలసిన కేంద్ర హోంశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు.

దేశంలో మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై అగత్యాలు హత్యాచారాలు జరగకుండా జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై అగాయిత్యాలు జరగడానికి విచ్చలవిడిగా పోర్న్ వెబ్‌సైట్లు, గంజాయి, మద్యం ఏరులై పారడం కారణమన్నారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టవలసిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ మహిళల పట్ల వివక్షత కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ద్యావా అన్నపూర్ణ, గుడికందుల సంధ్య, సహాయ కార్యదర్శులు సి.హెచ్ రోజా రాణి, మంచినీళ్ల లావణ్య, ఎడ్ల రజిత, నాయకులు స్వర్ణలత, జి.స్పందన, జి.సింధు, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధులు సి.రామరాజు, వెంకటేశ్వర్‌రావు, సంపత్ రమేశ్, కోడిముంజ శంకర్, జి.అశోక్ ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రభుత్వం రైతులను మోసగించింది

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

గన్నేరువరం, ఆగస్టు 18: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఏకకాలంలో రైతు రుణమాఫీని చేస్తామని హామీనిచ్చి సక్రమంగా అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోసం రైతులను వాడుకొని రుణమాఫీని అందరికీ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీని చేయాల్సింది పోయి కొర్రీలు పెడుతోందని విమర్శించారు. 30శాతం మందికి కూడా రుణమాఫీ చేయలేదని చెప్పారు. రుణమాఫీ కాని రైతులు అధైర్య పడవద్దన్నారు. బీజేపీ రైతాంగానికి ఉంటుందని అన్నారు. ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ కోసం భారీ నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఏలేటి చంద్రారెడ్డి, పర్శరాం, సత్తయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో శాంతి ర్యాలీ


హుజూరాబాద్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

హుజూరాబాద్, ఆగస్టు 18: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్త్రీలపై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, రాజకుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనను నిరసిస్తూ మౌన ప్రదర్శన పాటించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తిమ్మాపూర్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడ్డ నిందితు డిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని రామకృష్ణాకాలనీలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు ఆవుల రాధ, వీవో సంఘాల అధ్యక్షులు వేములవాడ పుష్ప, ఆవుల అనిత, చెవుల మనెమ్మ గాండ్ల మంజుల, ఆసిరి ప్రేమలత, గోనెల అనిత, వివిధ పార్టీలు చెందిన నాయకులు ఎడ్ల భూంరెడ్డి, సుగుర్తి జగదీశ్వరాచారి, దావు సంపత్‌రెడ్డి, గుజ్జుల ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి


చామనపల్లిలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గంగుల


సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


సర్వాయిపేటలో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్, ఆగష్టు18: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో గీత పారిశ్రామిక సహకార సంఘం, సర్వాయి పాపన్న విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటుకు 40వేల రూపాయలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

●**కరీంనగర్ టౌన్:** నగరపాలక సంస్థ కార్యాలయంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు నివాళులర్పించారు. అనంతరం 18వ డివిజన్ రేకుర్తిలోని సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏదుళ్ళ రాజశేఖర్, సుధగోని మాధవి కృష్ణగౌడ్, ఐలేందర్ యాదవ్, కోల మాలతి సంపత్, గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్, భూమాగౌడ్, పలువురు గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

●సర్వాయి పాపన్న విగ్రహానికి డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఘనంగా నివాళులర్పించారు.

●**కరీంనగర్ క్రైం:** సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఆదివారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సర్వాయిపాపన్నగౌడ్ చిత్రపటానికి అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

●**కరీంనగర్ అర్బన్:** సర్వాయిపేట కోట అభివృద్ధితో పాటు ఆ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దేందుకు 4.70 కోట్లు కేటాయించడంతో ప్రపంచంలోనే సర్వాయి పాపన్నగౌడ్‌కు మంచి గుర్తింపు వస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●**భగత్‌నగర్:** సర్దార్ సర్వాయి పాపన్న బహుజన వీరుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని మానేరు వంతెన వద్ద పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** సర్వాయిపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. నగరంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గౌడ సోదరుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బాబు, పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** నగరంలోని బీఎస్పీ కారాలయంలో సర్వాయి పాపన్నకు రాష్ట్ర కార్యదర్శి నిషాని రాంచంద్రం నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంద బాలయ్య కత్తెరపాక రమేశ్, సిరిసిల్ల అంజయ్య, బామండ్ల ఎల్లయ్య, గుర్రం సత్యనారాయణ, కవ్వంపెల్లి సంపత్, శ్రీహృదయ్ తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద సర్ధార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజు, సదానందం, శ్రీనివాస్, రాజ మౌళి, సమ్మయ్య, సారయ్య, సంపత్ పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, కౌన్సిలర్లు పొనగంటి మల్లన్న, బొంగోని వీరన్న పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండలంలో సర్వాయి పాపన్న జయంతిని గౌడ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయిపేట గ్రామ శివారులోగల కొమ్ముగుట్టపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడ కులస్తులు, వివిధ కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, గౌడ సంఘాల నాయకులు రాజు, రవిందర్, ప్రవీణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** బహుజనులను అందరిని ఐక్యం చేసిన ఉద్యమ నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కొని యాడారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ మానేరు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అలుగునూర్ మానేరు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహానికి మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీర్ల వేంకటేశ్వర్ రావు, జక్కుల నాగరాజు యాదవ్ పాల్గొన్నారు. తెలంగాణ గౌడ కల్లు గీత వృత్తి దారుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మల్యాల రాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్ కుమార్ గౌడ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌడిశెల రమేష్ గౌడ్, బహుజన కులాల రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, గౌడ పత్రికల ఎడిటర్లు దైవాల శంకర్, అమరగాని శ్రీనివాస్, బీసీ సంఘం మండల అధ్యక్షులు మాచర్ల రమేష్, మొండయ్య గౌడ్, సంపత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

●**చొప్పదండి:** పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గంగయ్యగౌడ్ పాల్గొన్నారు

●**గంగాధర:** బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరే రాజశేఖర్, ఆయా గ్రామాల గౌడ సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** మండలంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాల్లో గౌడ సంఘం జిల్లా నాయకుడు తళ్లపెల్లి తిరుపతిగౌడ్, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్ పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో గౌడ సంఘం నాయకులు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోతుక్కూరి శ్రీనివాస్, రామకృష్ణ, వీరస్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

●**వీణవంక:** మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పని సమ్మయ్య గౌడ్, దొమ్మటి రాజమల్లు, బొంగోని రాజయ్య, గట్టు మధు, రాజారాం పాల్గొన్నారు.

●**మానకొండూర్:** మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మానకొండూర్‌లో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ జడ్పిటీసీ తాల్ల పల్లి శేఖర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉప ముఖ్యమంత్రిని సన్మానించిన 'కోడూరి'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి కరీంనగర్ జిల్లకు చెందిన మాజీ శాషన సభ్యులు కోడూరి సత్యనారాయణగౌడ్‌ను కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పలువురు గౌడ సోదరులతో కలిసి కోడూరు సత్యనారాయణగౌడ్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ హాజరయ్యారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 18: ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన బంటు పవన్ స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, నాయకులు బోగం వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా దుర్శేడ్-చేగుర్తి రహదారి

-గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు -పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


దుర్శేడ్ శివారులో గుంతలమయంగా మారిన రహదారి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 18: కరీంనగర్ మండలం దుర్శేడ్-చేగుర్తి రహదారి గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. కరీంనగర్‌కు కూత వేటు దూరంలో ఉన్న గ్రామ రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కరీంనగర్ నుంచి దుర్శేడ్ మీదుగా చేగుర్తి గ్రామం ఉంది. ఈ గ్రామంలోకి వెళ్లాలంటే ఒక్కటే రహదారి ఉంది. ప్రస్తుతం ఈ రహదారి దుర్శేడ్ నుంచి దాదాపు 3కిలోమీటర్ల వరకు ఉంటుంది. చేగుర్తి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. వందలాది ట్రాక్టర్లు పగలు రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తుం టాయి. దీంతో రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీరు చేరి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికా రులు చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాతో పాటు ధ్వంసమైన రహదారి మరమ్మ తులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యలతో సతమతం

- ఇబ్బందులు పడుతున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్యూరిఫైయర్

చొప్పదండి, ఆగస్టు 18: చొప్పదండిలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులు సమస్యలతో సతమ తం అవుతున్నారు. ఆరేళ్ల క్రితం అత్యాధునిక సౌకర్యాలతో 500మంది విద్యార్థుల కోసం హాస్టల్‌ను నిర్మించారు. ప్రస్తుతం 150 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. చొప్పదండి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాల విద్యార్థులు కూడా హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌కు మిషిన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ కూడా నల్లా కనెక్షన్ ఇవ్వడం లేదు. హాస్టల్‌లో నాలుగు లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్ నాలుగేళ్లుగా పని చేయడంలేదు. విద్యార్థులకు బయట నుంచి మినరల్ వాటర్ తెప్పిస్తున్నారు. వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. హాస్టల్ ఆవరణలో పాత జడ్పీ స్కూల్ భవనాలు ఉన్నాయి. అవి శిథిలావస్థకు చేరినా అధికారులు వాటిని తొలగించడం లేదు. ఆ భవనాలు నిరుపయోగంగా మారడంతో వర్షం నీరు సమీపంలో నిలిచి దోమలు పెరిగిపోతున్నాయి. ఐదేళ్ల క్రితం నాటి మెస్ చార్జీలను అమలు చేస్తుండగా విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


శిథిలావస్థలో పాత భవనాలు

ముందస్తు రాఖీ వేడుకలు

గంగాధర, ఆగస్టు 18: ఆయా గ్రామా ల్లో ఆదివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. గంగాధరలో ధర్మ జాగరణ సమనవ్య విభాగం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. నాగిరెడ్డిపూర్, కోట్లనర్సిం హుల పల్లిలో ఇంటింటికీ తిరిగి రాఖీ వేడుకలు నిర్వహించారు.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుకు రాఖీ కట్టారు. ఆయన వెంట స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

వీణవంక: మండల కేంద్రాంతో పాటు నర్సింగాపూర్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి వొడితల ప్రణవ్ బాబు పాల్గొనగా ఆయనకు పలువురు రాఖీలు కట్టారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


కొర్కల్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్న ప్రణవ్

వీణవంక, ఆగస్టు 18: మండలంలోని కొర్కల్ గ్రామంలో పెద్దమ్మతల్లి సహిత శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ హుజూరా బాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రణవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, దేశిని కోటి, పంజాల సతీష్, గెల్లు శ్రీనివాస్, సాహెబ్ హుస్సేన్, మ్యాక వీరయ్య, పైడి కుమార్, కర్ర తిరుపతి రెడ్డి, కొలిపాక స్వామి, చింతల హరీష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ మేనేజర్ లావణ్య మృతికి సంతాపం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18: కేడీసీసీబీ కరీంనగర్ నాకా చౌరస్తా బ్రాంచి మేనేజర్, బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లావణ్య అకాల మృతి విచారకరమని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో ఎన్.సత్యనారాయణరావు, యూనియర్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు హన్మంతరావు, కోశాధికారి మనోజ్‌కుమార్, కార్యవర్గసభ్యులు రాజు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రహీం, జనరల్ మేనేజర్ శ్రీధర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్గించాలని కోరారు.

నేడు 'ఎన్నీల ముచ్చట్ల పిలుపు'

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 18: తెలంగాణ రచయితల వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం 136వ ఎన్నీల ముచ్చట్ల పిలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు పి.సంపత్ యాదవ్, టీచర్, ఇంటినెంబర్ 8-7-356/జి, రెసొనెన్స్ జూనియర్ కళాశాల పక్కన గణేశ్‌నగర్ బైపాస్‌రోడ్, హనుమాన్ నగరలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

గణేష్‌నగర్, ఆగస్టు 18: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 40 శాతానికి పెంచాలని ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్ కోరారు. లేకపోతే వేలాది మందితో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో కామారెడ్డిలో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టి దాని ఆధారంగా రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు.

మోడల్‌స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

గణేష్‌నగర్, ఆగస్టు 18: మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరుతూ ఈనెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద దీక్ష చేపడుతున్న దీక్షకు మద్దతుగా ఆదివారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా స్టీరింగ్ కమిటీ సభ్యులు కొమ్ము రమేష్, గోల్కొండ శ్రీధర్ హాజరై మాట్లాడుతూ మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సురేష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు న్యాయం చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 18: ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్‌జీటీలకు అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రేవోజు సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మల్యాల, ఆగస్టు 18: మల్యాలకు చెందిన బీజేపీ నాయకుడు గుండేటి గంగారాం భార్య లావణ్య ఇటీవల మృతి చెందగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే రామన్నపేటకు చెందిన బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్‌లు అయిన భార్యభర్తలు వకుళాభరణం శ్రీనివాస్, అరుణ కూడా ఇటీవల మృతి చెందగా వారి కుమారు డిని పరామర్శించి మృతుకి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంజయ్ వెంట మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ ఉన్నారు.


హుజూరాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1999-2001 కళాశాల విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హుజూరాబాద్/జమ్మికుంట రూరల్: ఆగస్టు 18: మరువలేనిది పాఠశాల స్మృతులని పూర్వ విద్యార్థులు రుజువు చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో 1999-2001 సంవత్సరంలో బైపీసీ చదివిన పూర్వ విద్యార్థులు 25ఏళ్ల అనంతరం ఆదివారం కలుసుకున్నారు. జమ్మికుంట పట్టణంలోని కాకతీయ పాఠ శాలకు చెందిన 2003-2004 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం విద్యా సంస్థల చైర్మన్ సుధాకర్‌రావును సన్మానించారు.


జమ్మికుంటలో హాజరైన 2003-2004 పదో తరగతి విద్యార్థులు